# చీకట్లో పారిజాతం




ఇచ్ఛాపురపు జగన్నాధరావు

ఆ పెద్ద భవనం మూడో అంతస్థులో బాల్కనీలో నిలబడి శేఖర్ తదేక దీక్షగా అనూరాధ వైపు చూశాడు. సంవత్సరం నుంచి అతను ఆమెని ఎన్నివందల సార్లో అలాగే చూసినా ఇంకా తనివి తీరలేదు. జన్మాంతం అలా చూస్తున్నా అతని ఆనందానికి హద్దు ఉండదని అతనికి తెలుసు. తనకి ప్రపంచంలో—జీవితంలో ఉన్న అన్ని సిరి సంపదల్నీ—అందరు మనుషుల్నీ ఒక్కనిముషంలో అతను ఆమె కోసం త్యాగం చెయ్యగలడు.

అలాటి త్యాగమేమీ అడిగే మనిషికాదు అనూరాధ. ఆమె మనస్సులో శేఖర్ కన్న విలువైన సిరికానీ సంపదకానీ ఏమీలేదు. ఈనాడు ఆమె వంటి మీద మెడలో గొలుసూ చెవులకి రింగులూ తప్ప ఏ అలంకారమూ లేదు. కాని ఆమె ఎంతో అందంగా ఉంది. అంత కంటె ఎన్నోరెట్లు అందంగా అతనికి కనిపిస్తోంది.

"నీ పుట్టినరోజుకి నీ నగలన్నీ పెట్టుకుని అలంకరించుకుంటావని అనుకున్నాను" అన్నాడు శేఖర్ మందహాసంతో.

"మీరు చెప్తే అలాగే చేస్తాను కానీ ఎందుకో ఆ నగలంటే మహావిరక్తి పుట్టిపోయింది." అంది అనూరాధ.

"నీ విరక్తికి కారణం తెలుసు అనూరాధా! నీ నగలకన్నా నువ్వెంతో అందంగా ఉంటావ్. ఏమీ వొద్దుకానీ కనీసం ఆ వజ్రాల దుద్దులు పెట్టుకోకూడదూ?"

"అవి మెరిసినప్పుడల్లా మీరు నాకళ్ళ వేపు చూడటం మానేస్తారా? ఈ రింగులు చేయించుకోడాని కెంత బాధ పడవలసి వొచ్చిందో మీకు తెలుసును—నా చెవులకి వజ్రాలు తప్ప పనికిరావని మీ పట్టుదల! ఇవాళ నా పుట్టినరోజు కదా, ఇవే ఉంచుకోనివ్వండి." అంది అనూరాధ.

అతను ఆమెని నెమ్మదిగా దగ్గరకు తీసుకున్నాడు.

"నీ మాట ఎప్పుడూ చెల్లుతుంది అనూరాధా! నీ పుట్టినరోజుకి ఏదో ఒక బహుమతి యివ్వాలికదా, ఒక్కసారి తిరిగొద్దాం." అన్నాడు శేఖర్.

ఆమె తల ఊపి తెర తీసి గదిలోకి వెళ్ళి ఐదు నిముషాల్లో తిరిగి వొచ్చింది.

"చెప్పు మెర్సిడే కారులో వెళదామా లేకపోతే కొత్త ఫియట్‌లో పోదామా?"

"రెండూ వొద్దండీ. ట్రాములో వెళ్దాం." ఆశగా అతని వేపు చూస్తూ చిరునవ్వుతో ప్రేమతో మెరుస్తున్న కళ్ళు అతని వైపు తిప్పి అంది అనూరాధ.

అతను కొంచం బాధపడినట్లు.."ఏం కోరిక రాధా! నీ పుట్టినరోజు నాడు కూడా ట్రాములో ఎక్కాలా?" అన్నాడు.

"ఇవాళ నా మాటకి ఎదురు చెప్పకూడదు మీరు. ఏం?" అంది అనూరాధ.

"ఏరోజూ నీ మాట కెదురు చెప్పన్న

రాధా, పద." అని తామె చెయ్యి పెట్టకుని అతను బయటకు వొచ్చాడు మెట్లు దిగి

"పోనీ ట్రామ్ స్టాప్ దాకా కారులో పెడదామా?"

"వొద్దండీ."

అయిదు గంటలైపోయినా ఇంకా ఎండ బాగా తగ్గలేదు. ట్రామ్ స్టాప్ చేరేసరికి రాధ ముఖం కొంచం ఎర్రబడింది. అది గమనించి శేఖర్ కనీసం గొడుగైనా తేనందుకు బాధపడ్డాడు.

ట్రాము వొచ్చేసరికి మరో పది నిమిషాలైనా అదృష్టంకొద్దీ ట్రాము ఖాళీగానే ఉంది. ఎక్కి ఇద్దరూ న్యూ మార్కెట్ చేరుకున్నారు. ముందర బట్టల దుకాణాల వైపు వెళ్లేరు. ఒక దుకాణం విండో ఏడెనిమిది చీరెలు డిస్ప్లే చూపి అనూరాధ ఆగింది. అతనామె పక్కన నిలబడి చీరల్ని జాగ్రత్తగా పరిశీలించాడు. ప్రతిచీర మీదా ఖరీదు వేసిన కాగితం అతికించబడి ఉంది. కనీసపు ఖరీదు రెండువందల ఎనభై రెండు రూపాయలు. అన్నిటికన్నా ఖరీదైనది, తొమ్మిది వందల అరవై రూపాయలు.. ఐదారు నిముషాలు వాటన్నిటినీ పరిశీలనగా చూసి "పదండి" అన్నది అనూరాధ.

"వీటిలో ఏ ఒక్కటీ నచ్చలేదా రాధా?"

"లేదండీ...అవి మామూలు చీరెలు. అదీకాక వీటికిప్పుడు అవసరమేముంది?"

"నీ యిష్టం రాధా! కాని యివేళ నీకు నిజంగా యిష్టమైనది ఏదో ఒకటి ఎంచుకోవాలి నాశక్తి నీకు తెలుసు" అన్నాడు శేఖర్.

ఎంతో అందంగా నవ్వి "మీ శక్తి తెలుసును కనకనే యీ రకం చీరెలు నేను తీసుకోడంలేదు. ఇంకా మిగిలిన దుకాణాలు చూద్దాం పదండి." అంది అనూరాధ.

ఈసారి సురాణామల్స్ షోవిండో దగ్గర ఆగారిద్దరూ. లోపల రకరకాల నెక్లెస్‌లూ, ఉంగరాలూ, గాజులూ ఎంతో చక్కగా కనిపిస్తున్నాయ్. వాటన్నిటితో రాధకి ఆరాధన చెయ్యాలని అనిపించింది శేఖర్‌కి. కాని ఆమె కళ్లల్లోకి చూడగానే ఆ కోరిక వ్యక్తం చేసేటందుకు అతనికి మాటరాలేదు. అలాటి వన్నీ పిచ్చి ఊహాలని రాధ కొట్టిపారేస్తుందని అతనికి తెలుసు. ఆమె అక్కడి నుంచి దారి తీయడం చూసి "ఇందులో ఏ ఒక్కటీ మీకు వచ్చలేదా రాధా?" అన్నాడు శేఖర్ ఆశగా. రాధ తల అడ్డంగా తిప్పింది. "ఈ నగలు పెట్టుకుంటేకాని మీకు బావుండనా? అలా అయితే చెప్పండి..."

"ఇవాళ నువ్వు నాకు ఎంత అందంగా కనిపిస్తున్నావో చెప్పడానికి మాటలు కూడా నాకు లేవు." ప్రతిరోజూ లాగే అన్నాడు శేఖర్. అనూరాధ సంతృప్తిగా చేసిన మందహాసం ఆమె కళ్లల్లో మాత్రం అతనికి కనుపించింది. ఆమె చేయి పట్టుకుని అతను ఒక ఫ్యాన్సీ దుకాణానికి వెళ్లేడు. అక్కడ షోవిండోలో చక్కటి పార్కర్ పెన్ సెట్ చూసి "ఇది చూడు రాధా! నీకు నచ్చితే చెప్పు..." అన్నాడు శేఖర్.

"దీనికన్న ఎంతో మంచి పెన్ను నాకు ఉందని మీకు తెలుసు. అదీకాక 51—పాత బడిపోయింది. నిజానికి 71—కూడా పాత బడిపోయింది. పి. ఎస్. వీళ్ల దగ్గరలేనే లేదు. పదండి" అని అతన్ని కొంచం బలంగా లాక్కుని వెళ్లింది.

న్యూమార్కెట్‌లోంచి బయటకొచ్చి, నడిచి చౌరంగీ చేరుకున్నారు. గ్రాండ్ హోటల్ ఆర్కేడ్‌లో ఆగి

"పోనీ లోపలకెళ్లి కాఫీ తాగుదామా?" అని ఆశగా అడిగాడు శేఖర్.

"ఇక్కడ కాఫీ నాకు నచ్చదని మీకు తెలుసుగా? అదీకాక మీరు వెళ్లగానే హోటల్ స్టాఫ్ అంతా మన కోసమే పరుగు పెడతారు. అది నాకు నచ్చదు. ఇవాళ మనం ఇద్దరు సామాన్యుల్లాగ నటిద్దాం. ఏం?" అంది అనూరాధ.

"సరే రాధా. చెప్పు ఏంచేద్దామో."

"కొంచంసేపు ఇక్కడే తిరుగుదాం. ఆ తరవాత ఇంటికి వెళ్లిపోదాం."

"మరి నీకు బహుమతి?"

"నాకు బహుమతి మీరే!"

"అలాక్కాదు రాధా! నువ్వేదో ఒకటి ఇవాళ కోరుకుని తీరాలి. మనం ఒక నాటకం ఆడుతున్నామని నాకు తెలుసునులే కాని దానికి ఏదో ఒక హద్దు ఉండాలి. నా సంతృప్తి కోసం నీ యిష్టం వొచ్చినది కొను."

"సరే" అంది అనూరాధ. ఆ పక్కనే ఒక బట్టల దుకాణం ఉంది. అక్కడ విండోలో చక్కని వాయిల్ చీరలున్నాయ్. అందులో ఒకటి లేత ఆకుపచ్చ రంగులో ఆమెకెంతో అందంగా కనిపించింది. అతని కది చూపెట్టి "మీ దగ్గర చాలినంత డబ్బుంటే ఆ చీర, దానికి మాచ్ అయ్యే బ్లౌజు పీసూ కొనండి" అంది అనూరాధ.

అతని ముఖంలో ఏంతో ఆశ్చర్యం కనుపించింది.

"ఇదేనా రాధా నువ్వివాళ కొనేది?" అన్నాడు కొంచం బాధగా.

"మీరు నాతో వాదించనని చెప్పేరుగా నాకు యీ చీరే కావాలి." అని నిశ్చయంగా చెప్పి మళ్లీ మార్దవంగా కొంచం హాస్యంగా "మీ దగ్గర డబ్బు లేకపోతే మాత్రం ఒద్దులెండి" అంది. అతనూ సీరియస్‌గా జేబులోంచి నోట్లు తీసి లెక్కపెట్టి—

"ఫరవా లేదులే. సరిపోవొచ్చు." అన్నాడు.

ఇద్దరూ దుకాణంలోకి వెళ్లి ఆ చీరకొని ప్యాకెట్ తీసుకుని యివతలకు వచ్చారు.

"నువ్వలిసిపోయావ్ రాధా, ఇలాగ తిరగడం నీ కలవాటు లేదు టాక్సీ పిలుస్తాను. ఇంటికి పోదాం." అన్నాడు.

"ఒద్దండి. టాక్సీ వొద్దు. నాకు ట్రాములంటే ఎంతో యిష్టం ట్రాములోనే పోదాం."

ఆమె పట్టుదల చూసి యిష్టం లేకపోయినా ఒప్పుకుని అతనామెని ట్రామ్ స్టాప్‌కు తీసుకెళ్లేడు అక్కడే అమ్ముతున్న చక్కటి మల్లిపూలు కొని ఇద్దరూ ట్రామెక్కేరు.

* * *

శేఖరం, రాధా ఇంటికి చేరేటప్పటికి బాగా చీకటి పడింది. తలుపు తాళం తీసుకుని గదిలో దీపం వేసి అతను ఆ గదిలో ఉన్న ఒక్క కుర్చీలో మెల్లగా కూర్చున్నాడు. రాధ ముఖం కసుక్కు వచ్చింది.

"అలసి పోయావా?"

"కాదురాధా, మన నాటకం తలుచుకుని బాధ పడుతున్నాను, నవ్వు కుంటున్నాను."

"ఆ. మళ్లీ నిజంలోకి వచ్చాం అయినా అంత సిరిసంపదలు మన కెందుకండీ?" అంది అనూరాధ.

ఆమె చిరునవ్వు ఒక్కనిముషం కూడా అదృశ్యం కాలేదు. అతను లేచి నిలబడి తెచ్చిన మల్లిపూలు ఆమె నిండాపోసి ఆప్యాయంగా కౌగలించుకుని "మనకి యీసంపద చాలు రాధా!" అన్నాడు.

ఆమె చాలాసేపు మాట్లాడలేదు. దుఃఖం ఆపుకునే ప్రయత్నంతో. ●